క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సుదర్శన రావు శుక్రవారం సందర్శించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టణం లోని బాలికల పాఠశాలలో ఏర్పాటు పోలింగ్ కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని హెచ్ఎం శారదను ఆదేశించారు. తహసీల్దార్ వెంట ఎన్నికల విభాగం డీటీ వీవీ ఆర్ జగన్నాథరావు, ఏఎస్సై మూర్తి, వీఆర్వో గోవింద్ ఉన్నారు.

అలసత్వం వీడాలి



వీఓఏలతో మాట్లాడుతున్న పీఎం రత్నాకర్

విజయనగరం రూరల్: డ్వాక్రా సంఘాలకు మంజూరు చేస్తున్న స్త్రీనిధి, భవిష్యనిధి రుణాల వసూళ్లలో బుక్‌కీపర్లు (వీఓఏలు) అలసత్వం వీడాలని వెలుగు శాఖ పీఎం రత్నాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుక్‌కీపర్లు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పథకాలపై సమీక్షించి, సిబ్బంది అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జేడీఎం మార్టిన్, హెచ్‌డీ ఏపీఎం గీత, ఏపీఎం స్వామితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ వివాదంపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ గోవింద, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటి పాలెం ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి సంబంధించిన స్థలంపై చెలరేగిన వివాదంపై తహసీల్దార్ తాడ్డి గోవింద శుక్రవారం విచారణ జరిపారు. ప్రహరీ నిర్మించాల్సిన స్థలం గ్రామకంఠం భూమిగా గుర్తించారు. అయితే ఆ భూమిని ఆక్రమించిన కొందరు పనులకు అడ్డు తగిలారు. దీంతో అక్రమణదారులను తగిన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయానికి రావాలని తహసీల్దార్ ఆదేశించారు. ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'గురానా'



గురానా సూరిబాబు

విజయనగరం రూరల్: ఏపీ నిరుద్యోగ సంఘ విజయనగరం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని ద్వారపూడి గ్రామానికి చెందిన గురానా సూరిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ... నిరుద్యోగుల తరఫున కష్టపడి పనిచేస్తానని చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాతులూరి కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

అక్రమార్కులపై రౌడీషీట్ తెరవాలి



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గో సంరక్షణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం అర్బన్: పెదమానాపురం పశువుల సంత నుంచి పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న అక్రమార్కులపై రౌడీషీట్ తెరవాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేదారిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర హైకోర్ట్ ఆదేశాలకు విరుద్ధంగా దత్తిరాజేరు మండలం పెదమానాపురం పశువుల సంత నుంచి ప్రతిరోజూ వేలాది పశువులను తరలిస్తున్నారన్నారు. అక్రమ రవాణాదారులపై రౌడీషీట్లు నమోదు చేయడంతో పాటు పశువుల రవాణాను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు బోళ్ల రాజకుమారి, మహిళా కార్యదర్శి వేమల యమున పాల్గొన్నారు.

నెరవేరని స్వచ్ఛభారత్ లక్ష్యం..

- గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు



రామతీర్థం రహదారిలో మురుగునీరు



దేవుని నెలివాడ వద్ద ప్రధాన రహదారిపై మురుగు నీరు

నెల్లిమర్ల రూరల్: స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు ఇస్తున్నారు. కార్యక్రమం ప్రారంభం రోజు అధికారులు, ప్రజా ప్రతినిధులు చీపుర్లు చేతబట్టి ఫొటోలకు ఫోజులిచ్చి మరీ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మారుస్తామని ప్రకటనలు గుప్పించారు. అయితే ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసన, అంటురోగాలతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 28 పంచాయతీలుండగా.. పలు గ్రామాల్లోని వీధుల్లో చెత్త, కాలువల్లో మురుగు పేరుకుపోయింది. ముఖ్యంగా రామతీర్థంలో మురుగు పేరుకుపోవడంతో దోమలు, ఈగల బెడద ఎక్కువైంది. అంటురోగాలు కూడా ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

పెరుగుతున్న ఫైలేరియా కేసులు..

అపారిశుధ్యం కారణంగా గ్రామాల్లో దోమలు ఫైలేరియా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం నెల్లిమర్ల మండలంలో గ్రామానికి 10 నుంచి 20 మంది వరకు ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్నారు. ఒక్క ఒమ్మి గ్రామంలోనే 70 మందికి పైగానే ఫైలేరియా వ్యాధిగ్రస్తులున్నారు. సతివాడ, కొండవెలగాడ, బొప్పడాం, వల్లూరు, పూతికపేట, తంగుడుబిల్లి, దన్నానపేట, సారిపల్లి, చంద్రంపేట, ఏటీ అగ్రహారం, తదితర గ్రామాల్లో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయి. కనీసం ఆ గ్రామాల్లో కూడా పారిశుధ్య పనులు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

ఆక్రమణలతో ఇబ్బందులు..

ఇదిలా ఉంటే కాలువల మీద చాలా మంది నిర్మాణాలు చేపడుతుండడంతో మురుగు తీయడం ఇబ్బందిగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. కాలువలను ఆక్రమించడం, చెత్తా చెదారాలు అందులోనే వేస్తుండడంతో పనులు చేయలేకపోతున్నామన్నది పారిశుధ్య కార్మికుల వాదన. ఏది ఏమైనా అధికారులు చురుగ్గా పారిశుధ్య పనులు చేయించాల్సి ఉన్నా.. ప్రజల్లో కూడా మార్పురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



వల్లూరు పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త

పారిశుధ్య పనులు చేపడుతున్నాం..

గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నాం. పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలువలను కూడా శుభ్రం చేస్తున్నారు. ఎవరైనా సమస్యను మా దృష్టికి తీసుకువస్తే వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తున్నాం. కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు మురుగు నీరు ఇంకిపోవడానికి గుంతలు తవ్వే కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమవుతున్నాం.

– శంకర జగన్నాథ్, ఈఓపీఆర్డీ, నెల్లిమర్ల

పాఠశాల వద్ద చెత్తను తొలగించండి

మా గ్రామంలో కాలువలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాల వద్ద చెత్త విపరీతంగా పేరుకుపోయింది. ఇరువైపులా పిచ్చి మొక్కలు దట్టంగా ఉన్నాయి. దీంతో దోమలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలి.

– పంచాది శ్రీను, వల్లూరు గ్రామం

ఐఓబీ సేవలను వినియోగించుకోండి



డెంకాడ: ఐఓబీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ రీజనల్ మేనేజర్ బిజయ్ కేతన్ సాహు

డెంకాడ: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని సీనియర్ రీజనల్ మేనేజర్ బిజయ్ కేతన్ సాహు అన్నారు. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్‌గేట్ ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో ఏర్పాటు చేసిన ఐఓబీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐఓబీ ద్వారా ఇంటి రుణం, బంగారు రుణాలు, మార్టుగేజ్, వాహన కొనుగోలు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ కె.బాలకృష్ణ, సామాజిక కార్యకర్త యారబాటి రమణమూర్తి, రాజపులోవ, చింతలవలస బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారులు

ఖాతాదారుల అభివృద్ధే ధ్యేయం..

పూసపాటిరేగ: ఖాతాదారుల అభివృద్ధే ధ్యేయంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా పనిచేస్తోందని ఆ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ మనోజ్ కె. శ్రీవాస్తవ అన్నారు. భోగాపురం మండల కేంద్రంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఖాతాదారులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ బి.జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

• మహిళలు అభివృద్ధి చెందాలి..



మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందినప్పుడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మెప్మా బజారును శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మహిళా ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేసి వారికి చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, వివిధ డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– విజయనగరం

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

- తూర్పుకాపు సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబు నాయుడు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావును కలసిన సాయిబాబు

విజయనగరం రూరల్: రాష్ట్రంలో ఉన్న తూర్పుకాపుల సమస్యల పరిష్కారానికి శతశాతం కృషి చేస్తానని తూర్పుకాపు సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సాయిబాబునాయుడు అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

రోగులను సకాలంలో తరలించాలి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించాలని ఆన్‌జాబ్ ట్రైనర్ (ఓజేటీ) ఆలుగుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక 108 సంస్థ కార్యాలయంలో మెడికల్ టెక్నీషియన్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన సీపీఆర్, మానవ శరీరభాగాల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముఖ్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ స్వాతి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జగదీష్ ,జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, సోమేశ్, పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, రాజు, రాహుల్ కళ్యాణి, తిరుమల, ప్రసాద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయరాదు

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



తాగునీటిని వృథా చేయొద్దని మహిళలకు సూచనలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: తాగునీటిని వృథా చేయరాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 16వ డివిజన్ 19వ నంబర్ సచివాలయం పరిసరాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డివిజన్ ప్రాంతంలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వ్యాపారాలు చేస్తే సహించేది లేదన్నారు. టిఫిన్ దుకాణాలు, హోటళ్లలో తప్పనిసరిగా గ్యాస్ ఆధారంగానే వంటలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు, టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

• మాదకద్రవ్యాల జోలికి పోవద్దు..



యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సూచించారు. స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే ట్రాఫిక్ రూల్స్, రెగ్యులేషన్స్, యాంటీ రాగింగ్ యాక్ట్స్, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి, వన్‌టౌన్ ఎస్సై రామగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

– విజయనగరం క్రైమ్

ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోండి..



కేసలి అప్పారావుకు వినతిపత్రం ఇస్తున్న జశ్వంత్ కుటుంబ సభ్యులు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని సూర్య హాస్పిటల్ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల మృతి చెందిన మజ్జి జశ్వంత్ (14) కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడు జశ్వంత్ నీరసంగా ఉన్నాడని ఉపాధ్యాయులు చెప్పడంతో వెంటనే వెళ్లి కుమారుడ్ని సూర్య ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. అక్కడి వైద్యసిబ్బంది సెలైన్ ఎక్కించి, ఇంజెక్షన్ చేశారన్నారు. చికిత్స అందించిన కొద్దిసేపటికే తమ బిడ్డ జశ్వంత్ మృతి చెందాడని.. అయినా స్కాన్, టెస్ట్‌ల పేరుతో తమను మభ్య పెట్టారని తెలిపారు. వైద్య సిబ్బంపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేసలి అప్పారావు స్పందిస్తూ.. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ నియమించి, మూడురోజుల్లోగా రిపోర్టు సమర్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని ఆదేశించారన్నారు. తప్పు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

• చురుగ్గా పారిశుధ్య పనులు..



విజయనగరంలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రత్యేక బృంద కార్మికులతో కాలువల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రధాన కాలువల్లో జేసీబీల సహాయంతో.. చిన్న చిన్న కాలువల్లో బాబ్ కార్టు యంత్రాలతో చెత్తాచెదారాలు తొలగిస్తున్నారు.

– విజయనగరం

వైఎస్సార్‌సీపీ నాయకుడికి కన్నీటి వీడ్కోలు

- శోకసంద్రంలో మోదవలస

డెంకాడ: భోగాపురం మండలం నారుపేట వద్ద జనవరి 30వ తేదీ సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోని అప్పలనాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పలనాయుడు మృతదేహానికి సుందరపేట ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అశ్రునయనాల మధ్య మృతదేహాన్ని డెంకాడ మండలం మోదవలసకు ర్యాలీగా తీసుకువచ్చారు. దీంతో మోదవలస శోకసంద్రంలో మునిగిపోయింది. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బద్దుకొండ మణిదీప్, బంటుపల్లి వాసుదేవరావు, కంది చంద్రశేఖరరావు, కంది సూర్యనారాయణ, ఉప్పాడ సూర్యనారాయణ, పిన్నింటి తమ్మునాయుడు, రొంగలి కనకసింహాచలం, కనకల రామారావు, తదితరులు అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. ఈయన మృతితో వైఎస్సార్‌సీపీకి తీరని నష్టమని ఎమ్మెల్సీ పెనుమత్స అన్నారు. మృతుడికి భార్య రమాదేవి, కుమార్తెలు మీనాక్షిదివ్య, యువశ్వేత, కుమారుడు హరిహర్ష ఉన్నారు. రెండో కుమార్తె యువశ్వేత ప్రస్తుతం మోదవలస ఎంపీటీసీ సభ్యురాలుగా పని చేస్తున్నారు.



మరణించిన బోని అప్పలనాయుడు(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు